# మనుష్యులు

ఈమాటు మనం మాట్లాడుకొనేది మనుష్యుల్ని గురించి—

పెద్దజంతువు లన్నిట్లోకీ రెండే కాళ్లుగల ఒకేవొక చిత్రమైన జాతి మనుషులే. అందుకే వీళ్ళను ద్విపాద పశువులన్నారు. ఇదే వీళ్ళలోని ప్రత్యేకత. గాడిదలు, కుక్కలు, పందులు మొదలైన జంతువులలోకి మల్లేనే మనుషులలోకూడా ఆడా, మొగా అనే రెండు అత్యవసరమైన తెగలున్నాయి. మిగతా జంతువులలో ఆయా తెగలకు సంబంధించిన ప్రాథమిక గుణగణాలన్నీ మనుషులలోని ఆడా, మొగా తెగలకుకూడా 'తు, చ' తప్పకుండా వర్తిస్తాయి.

మానవుడి పుట్టుపూర్వోత్తరాలను గురించినంత అనుమానాస్పదమైన విషయమూ, వివాదహేతువూ, మరెక్కడా చూడం. ఇతడు 'దేవుడు' అనబడే వానియొక్క ప్రత్యేకసృష్టి అని కొందరి మతం. డార్విన్ మొదలైన వైజ్ఞానికులు తమ పరిశోధనలద్వారా 'ఎమీబా' అనబడే ఒకానొక అతిసూక్ష్మ జీవకణం నానాటికీ వృద్ధిపొందుతూ వచ్చి అనేక రూపాలు దాలుస్తూ, చివరికి 'యాన్త్రోపాయిడ్ ఏప్' అనే ఒకానొక కోతిగా తయారై, ఆ కోతి మళ్ళీ కొన్నాళ్ళకు మానవత్వం దాల్చిందని గ్రంధాలు వ్రాసిపెట్టారు. దీన్నే 'పరిణామవాదం' అంటారు. ఈ వాదం ప్రకారం మన ముత్తాతల ముత్తాతలంతా తోకలు కలిగి వుండేవారనీ, వారు క్రమేణా ఆ తోకలను విసర్జించి, చెట్లుదిగి, నిట్టాకూ నడవడం నేర్చుకుని, మనుష్యులయ్యారనీ, మనమంతా వారి సంతతివారమనీ ఒప్పుకోవాలి. ఇది చాలామందికి హితవు లేక 'వొట్టి అబద్ధం' అనేస్తారు.

ఏమైనా, పైన చెప్పిన రెండు అభిప్రాయాలవారికీ చాలాకాలం నుంచి వాద వివాదాలు జరుగుతూ వున్నాయి. క్రిస్టియన్ మతస్థులు బైబిలుతీసి 'దేవుడు ఏడురోజుల్లో ప్రపంచాన్నీ, వెల్తురునూ, గాలినీ, జంతువులనూ, మానవులనూ సృష్టించాడు చూసుకోండి' అంటే వైజ్ఞా

నిటలు విజ్ఞాన పరిశోధనాలయాలకు వెళ్ళి అక్కడ కనిపించే 'ఫాసిల్సు' (జంతువుల శిథిల రూపాలు) చూడండి. పరిణామ సిద్ధాంతం అర్థమవుతుంది' అని బోధిస్తారు. ఈ విధమైన తర్క వితర్కాలలో ప్రాణం విసిగి, బుర్ర చెడి 'మనిషి ఎలా పుడితే మనకేం?' అని కొందరు అసలు విషయాన్నుంచి దాటుకుపోతారు. జి. కే. చెస్టర్టన్ అనే పైత్య ప్రకోపంబలిసిన రచయిత ఈ విషయాన్ని గురించి తర్కించి తర్కించి ప్రాణంవిసిగి 'మనిషి తలక్రిందులైన కోతి-యింతకంటే మనం తెలుసుకోవలసింది ఏమీ లేదు' అని నిద్రపోయి వూరుకున్నాడు.

మనుషులు ఎలావుంటారూ? అంటే మనల్ని మనం చూసుకుంటే చాలదు. మనకన్న పెద్దమనుషులూ వున్నారు. మనకన్న చిన్న మనుషులూవున్నారు, మనకన్న చిత్రవిచిత్రమైన మనుషులూ వున్నారు.

సాధారణంగా మనిషి పుట్టినప్పుడు అడుగు మొదలు అడుగున్నర పొడుగు వుండడం కద్దు. చాల తక్కువపిల్లలు కొందరు జానెడూ బెత్తెడూ కూడా వుండడం కద్దు. నెలలు హెచ్చైనవారు రెండు అడుగుల వరకూ కూడా వుండవచ్చు. ప్రతిమనిషికీ ఒక తల, రెండు కాళ్లూ, రెండు చేతులూ, ఒక పొట్ట, ఒక్కటే గుండెకాయ వుంటాయి. రెండు గుండెకాయలుంటే బాగానే వుండును గాని ఆపద్ధతి ప్రకారం యుద్ధాలు ఎంతకీ తెగతెంపులు కావు. పైన చెప్పినవిగాక కళ్ళు, ముక్కు, నోరు, చెవులు మొదలైన ఇంద్రియాలు కూడా మానవులకు లేకపోలేదు. ఎదిగిన మనుషులు సాధారణంగా 5 మొదలు 6 అడుగుల పొడుగు వుంటారు. ఆఫ్రికా మొదలైనచోట్ల కొంతమంది 3 లేక 4 అడుగులే వుంటారటకూడా. కొంతమంది మనుషులు 7 లేక 8 అడుగుల వరకు కూడా వుంటారు. కాని, వీళ్ళు బహు తక్కువమందే వుంటారు. లేకపోతే వీళ్లవల్ల పొట్టిగా వుండేవాళ్ళకి చాలానష్టం కలిగివుండును. మనుషులలో తెలుపు, నలుపు, ఎరుపు, పసుపురంగులవారున్నారు. తరుచుగా ఒక రంగువారు ఇంకో రంగువార్ని ద్వేషించడం కద్దు.

మనుషులు ఇతర జంతువులకన్నా మంచివారనీ, నీతివంతులనీ వారు

కట్టుకునే గుడ్డలవల్ల, తినే తిళ్ళవల్ల, చేసే న్యాయ యుద్ధాలవల్ల తెలుస్తుంది. పశుపక్ష్యాదులన్నీ ఆదిలో ఏవిధంగా వున్నాయో ఇప్పుడూ అలానే వున్నాయి. మనుష్యు లట్లా కాదు. ప్రతినిముషం తమ ఆచార వ్యవహారాల్లోనూ, తిండిలోనూ మార్పుతేవడానికి ప్రయత్నిస్తూనే వుంటారు. మానవులవద్ద కొన్ని అద్భుతశక్తు లున్నాయి. ఆ శక్తుల ద్వారా ప్రపంచంలో జనాభాను ఎప్పుడు వృద్ధిచేయాలో, ఎప్పుడు అవసరమైతే దాన్ని యుద్ధ సూత్రంద్వారా క్షీణింపజేయాలో తెలుసు కుని ఆవిధంగా చేస్తూంటారు. అందుకే ప్రపంచంలో కొన్నాళ్ళు యుద్ధం, కొన్నాళ్ళు శాంతి కనిపిస్తూ వుంటుంది.

మనుషులలోని ప్రత్యేకత పిల్లల్ని పుట్టించడం. మిగతా జంతువులు పిల్లల్ని కనవని నా అభిప్రాయంకాదు. కంటాయి, కాని, అవి కనడానికీ మానవులు కనడానికీ చాలా తేడావుంది. అందుకనే ఆవు, మేక, కుక్క మొదలైనవి పిల్లల్ని పెడితే ఆవు యీనింది, మేక యీనింది, కుక్క యీనింది అంటాం; మనిషి, అంటే-ఆడమనిషి- పిల్లల్నికంటే, సుబ్బమ్మకి పురుడొచ్చింది-మాణిక్యానికి పురుడొచ్చింది యిలా అంటాం. చూశారా మనుష్యులకీ జంతువులకీ ఎంత తారతమ్యమో?

ఈ తారతమ్యానికి కారణమేమిటీ అని? మాట్లాడుకుందాం-

జంతువుల్లో పెళ్ళిళ్లులేవు. కట్టుబాట్లు లేవు. వాటికి బుద్ధిపుట్టినప్పుడు, నగాలు ప్రాద్బలం చేసినప్పుడు, వెళ్ళి, వాటికి ఇష్టమైన ఆడజంతు వులతో జతకూడతాయి. వాటికి పడకగదులు, పందిరి పట్టిమంచాలూ, ఇవేమీ లేవు. రోడ్డుమీద పొర్లి రోడ్డుమీదపిల్లల్ని పెడతాయి. వాటికి సిగ్గు భిడియాలులేవు; మానాభిమానాలు లేవు. మనుష్యులట్లా కాదు. మొగవారు ఒక రకం దుస్తులు, ఆడవారు ఒక రకం దుస్తులు-శరీర తత్వాన్నిబట్టి నిర్ణయింప బడినవాటిని ధరించివుంటారు. వాటిని ఎంతో అవసరమైన సమయాల్లో, ఎంతో రహస్యంగాగాని విడిచిపెట్టరు. ఈ విధంగా జంతువులలో కనిపించే బోసితనాన్ని, నగ్నత్వాన్ని మానవులు జయించారు.

స్త్రీపురుషులు, ముఖ్యంగా మానవజాతి స్త్రీపురుషులు, ప్రకృతి యొక్క సృష్టికార్యాన్ని నిర్వర్తించడానికి కమీషన్ పొందారు.

అయితే మిగతా జంతువులన్నీ నియమిత కాలాల్లో నియమిత ఋతువుల్లో, కేవలం ప్రకృతి కార్యాన్ని సాధించే ఉద్దేశంతోనే జతకూడుతూంటే మానవులు అన్ని కాలాలలోనూ కేవలం జాత్యాభివృద్ధికోసమే గాకుండా వ్యక్తిగతమైన ఆనందంకోసం, ఏదో దాహం తీర్చుకోవడం కోసంకూడా ఎప్పుడు పడితే అప్పుడు జతకూడే వుద్యమంలో నిమగ్నులై వుంటూంటారు. జంతువులకు మల్లే ఏవొక్క ఋతువులోనో గాకుండా సర్వకాల సర్వావస్థలయందూ కూడా స్త్రీపురుషులు జతకూడేట్లు చేసే ప్రత్యేకత వారు తినే ఆహారంద్వారానూ, పడకగదులలో పింగాణీ పళ్లేలలో దాచిపెట్టుకునే మిఠాయీలూ, కౌజులు, హల్వాలద్వారానూ సంపాదించుకున్నదే! ఇంతే గాకుండా స్త్రీ పురుషులు ఒండొరులను ఆకర్షించుకుందుకు చేసే ప్రయత్నాలూ, కట్టుకునే రంగు రంగుల దుస్తులూ, పూసుకునే సువాసన ద్రవ్యాలూ, పెట్టుకునే పూలచెండ్లూ యివన్ని గాక పెద్దలు వ్రాసిపెట్టిన గ్రంధాల ద్వారానూ, చిత్రకారులు వ్రాసిపెట్టిన చిత్రాల ద్వారానూ, పడకగదులలో తలుపులు బిగించుకుని కూర్చుని పొందేరహస్య వాతావరణంలో, ఒంటరితనంలో సిగ్గు భిడియాల నుంచీ, దుస్తులు మొదలైన కట్టుబాట్లనుంచీ తాత్కాలికంగా పొందే మోక్షంద్వారానూ కూడా వీరిలో కాముక వ్యాపారదృష్టి ప్రబలింది. యీ తావాతా, మనుష్యులు యితర జంతువులకు మల్లేగాకుండా జాత్యభివృద్ధితోబాటు శృంగార కళ అనే - పశుపక్ష్యాదులకు అర్థంకాని-ఒక ప్రత్యేక కళను అమలులోకి తీసుకువచ్చారు. ఇది మానవజాతికి వివాహాన్నీ, శోభనూ, శోభనపు గదులను, అల్లసాని పెద్దన్నలనూ, శృంగార శ్రీనాథులనూ, డాన్‌జుఆన్‌లనూ, వ్యభిచారాలనూ, డైవోర్సు కోర్టులనూ ప్రసాదించింది.

ఈ విషయాన్ని గురించి అనేకమంది పెద్ద పెద్దలు భయపడుతున్నారు. వెల్సు పండితునివంటి ఆశావాది కూడా 'Fate of Homo

Sapiens' అనే గ్రంథంలో మానవుడి భవిష్యత్తును తలుచుకుని పెదవి విరిచాడు. యుద్ధాలతోనూ అవినీతితోనూ, రోగాలతోనూ మానవజాతి భవిష్యత్తులో చిక్కి శల్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయని వెల్సు పండితుడు నిట్టూర్చాడు. కాని, తినడానికి తిండి, పీల్చడానికి గాలి, అందరికీ చాలినంతమంది ఆడవాళ్లూ, నివాసస్థలమూ, వ్రాసుకుందుకు కాయితాలూ ఉన్నన్నాళ్లు మానవజాతి చెక్కుచెదరదని నా అభిప్రాయం.

---

## కొండపల్లి బొమ్మ

పదునైన జీవితపు టంచులమీద లాక్షారుణిత రేఖావృతమైన పదపల్లవ యుగళిని మృదువుగా మోపి ఘణఘణ మ్రోగే గజ్జల మోతతో భావవీధుల్లో పసందుగా నాట్యమాడే ఆతొలి వికాసపు రోజుల్లో ఎక్కడో, ఏవిటో జారవిడిచి, పోగొట్టుకుని, దాని వెతుక్కుంటూన్నట్టుగా ఆ ముడతపడిన కళ్ళను బలహీనంగా మెదిలిస్తూ, ఆ పోగొట్టుకున్న దాన్ని ఎప్పుడైనా, ఎవరైనా, ఏ భావంతోనైనా తిరిగి తనకు పదిలంగా తెచ్చి యిస్తారేమోననే ఆశతో ఎదురు తెన్నులు చూస్తూన్నట్టుగా ఎప్పుడూ అలా నిలబడి వుంటుందామె.

ఆ దారిన పోయేవాళ్ళంతా ఆమెను గమనిస్తూ, రోజురోజూ గమనిస్తూ, సంవత్సరాల తరబడి గమనిస్తూ ఆమెలో ఏ విధమైన కొత్త మార్పులూ కొత్త అనభూతులూ కొత్త సంచలనాలూ కలక్క పోవడాన్ని చూసి ఆమె వూరికే అలా ఆలోచిస్తూ నిలబడుతుందే తప్ప మరేమీ ఆమెలో లేదనే తీర్మానానికి వచ్చారు.

నిజంకూడా అంతే. ఆమె వూరికే కళ్లు వప్పగించి అలా నిలబడుతుంది. ఏమీ చెయ్యదు, ఎవరితోనూ మాట్లాడదు. ఎవర్నీ ఏమీ అడగదు. 'ఏదో పోగొట్టుకున్నాను' అనే భావాన్నికూడా ఆమె క్రమేణా మరిచిపోతూ వస్తూంది. ఎవరో తిరిగి దాన్ని తెచ్చి తనకు యిస్తారనేది